క్లుప్తంగా

సైకిల్‌పై జీవీఎంసీకి కమిషనర్



తన బంగ్లా నుంచి జీవీఎంసీకి సైకిల్‌పై చేరుకుంటున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. తన బంగ్లా నుంచి సోమవారం జీవీఎంసీకి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జరిగిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని విగ్రహాన్ని ప్రతిష్టించారు. అనంతరం వార్డు కార్పొరేటర్ స్వాతి, స్థానిక పెద్దలతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధనలో ఎంపీ ఎంవీవీ భక్తులకు భోజనాలు వడ్డించారు.

పూర్వీ రజాక్‌కు అభినందన

ఎంవీపీ కాలనీ: విభిన్న నైపుణ్యాలతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన పూర్వీ రజాక్‌ను విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందించారు. సూపర్ టాలెంట్ కిడ్‌గా పూర్వీ రజాక్ 2022లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. దీంతో పాటు కళలు, సాహిత్యం, క్రీడా రంగాల్లో 12 ఏళ్ల వయసులోనే 300 వరకు అవార్డులు గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో పూర్వీరజాక్‌ను ఎంవీవీ సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొల్లి అప్పారావు, శివరామకృష్ణ, పీతల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన పత్రానికి పురస్కారం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం పరిశోధకుడు డాక్టర్ ఎం.సురేష్ మీనన్ బెస్ట్ పేపర్ అవార్డు సాధించారు. బ్లైండెడ్ అండ్ ఆన్‌లైన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ అంశంపై మదన్‌మోహన్ మాలవ్య టీచింగ్ ట్రైనింగ్ సెంటర్(యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ), ఎన్‌టీపీసీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ లండన్ సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో సురేష్‌మీనన్ తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. దీనికి బెస్ట్ పేపర్‌గా అవార్డు లభించింది. ఈ సందర్భంగా మీనన్‌ను విభాగ ఆచార్యుడు డి.వి.ఆర్.మూర్తి, తదితరులు అభినందించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: సేవా స్ఫూర్తి అసోసియేషన్, ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరగనుంది. జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో సేవా స్ఫూర్తి కార్యాలయంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అందుబాటులో ఉండే ఈ శిబిరంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు స్త్రీలకు ఉచితంగా గైనిక్ వైద్య పరీక్షలు, పొగాకు, పాన్ గుట్కా అలవాటు ఉన్న పురుషులకు నోటి పరీక్షలు చేయనున్నారని పేర్కొన్నారు. 25 సంవత్సరాలు పైబడిన స్త్రీలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌కు ఇక్కడ వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లు నమోదు చేసుకోవడానికి 7981631404 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

విమ్స్‌లో డిజిటల్ ఓపీ

- ఆస్పత్రికి ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్ కేటాయింపు
- స్కాన్ చేస్తే ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కౌంటర్‌లో ఓపీ నంబర్



కంప్యూటర్‌లో ఓపీ వివరాలతో కూడిన పత్రాలు డౌన్‌లోడు చేసి రోగులకు ఇస్తున్న సిబ్బంది



విమ్స్‌లో ఓపీ వద్ద క్యూ ఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేస్తున్న మహిళ

ఆరిలోవ: 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మెషిన్'లో భాగంగా ఆస్పత్రులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటలైజ్ చేస్తున్నాయి. ఈ మేరకు విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లోను అధికారులు కీలక మార్పులు చేస్తున్నారు. ముందుగా ఓపీ సేవలను డిజిటలైజ్ చేసే దిశగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఓపీ చీటీ తీసుకునేందుకు కౌంటర్ల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేకుండా ఆస్పత్రి ప్రాంగణంలో పలుచోట్ల క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. అభా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే...ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అభా కౌంటర్‌లో క్షణాల్లో ఓపీ ఇస్తారు. దీనివల్ల రోగి గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం విమ్స్‌లో ఓపీ తీసుకోవాలంటే కనీసం అరగంట సమయం పడుతుంది. ఇకపై రోగులకు ఈ సమయం ఆదా కానుంది. ఈ సేవలను ఆస్పత్రికి వచ్చే రోగులు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. స్మార్ట్ ఫోన్ లేని రోగులు యథావిధిగానే ఓపీ కౌంటర్లలో ఓపీ సేవలు పొందవచ్చునన్నారు.

క్యూఆర్ కోడ్‌తో..

విమ్స్ ఓపీ విభాగం వద్ద గోడపై పెద్ద సైజులో క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్ అతికించారు. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు అక్కడికి వెళ్లి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఏబీహెచ్‌ఏ) యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడు చేసుకోవాలి. అనంతరం గోడ మీద అతికించే క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవడం ద్వారా ఓపీ నమోదవుతుంది. అవసరమైన వివరాలతో ఓపీ పత్రం అందుతుంది. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి రోగి పేరు, ఆధార్ నంబరు, ఏ వ్యాధితో బాధపడుతున్నారో నమోదు చేయాలి. అనంతరం మొబైల్ మెసేజ్‌లో వచ్చే ఓపీ నంబరు చెబితే సిబ్బంది కంప్యూటర్ నుంచి రోగికి సంబంధించిన వివరాలతో కూడిన పత్రం డౌన్‌లోడు చేసి అందిస్తారు. ఆ పత్రం పట్టుకొని సంబంధిత వైద్యుడు ఉండే ఓపీ గదికి వెళ్లాలి. అక్కడ కూడా ఆ వైద్యుడు తన వద్ద ఉండే కంప్యూటర్‌లో రోగి వివరాలు నమోదు చేస్తారు. రోగి ఎప్పటి నుంచి ఆ వ్యాధితో బాధపడుతున్నాడు, దాని లక్షణాలు తదితర వాటిని నమోదు చేసుకొని దానికి అవసరమైన వైద్యం అందిస్తారు. మళ్లీ కొద్దిరోజులు తర్వాత ఎప్పుడు ఆ రోగి వెళ్లినా ఆధార్ నంబరు నమోదు చేయగానే అతని పూర్వపు వివరాలు అన్నీ తెలుస్తాయి. దీంతో రోగిని పరీక్షించడం వైద్యుడికి సులువవుతుంది. ఈ విధానంపై విమ్స్‌కు వెళ్తున్న రోగులు, వారి బంధువులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాప్ డౌన్‌లోడు చేయడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం తెలియని వారికి ఆస్పత్రి సిబ్బంది సహాయం చేస్తున్నారు.



రోగి బంధువుకు డిజిటల్ ఓపీ నమోదుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మొబైల్ లేనివారి కోసం పాత పద్ధతిలోనూ ఓపీ

మొబైల్ లేనివారు, చదువులేని వారి కోసం పాత పద్ధతిలో కూడా ప్రస్తుతం ఓపీ నమోదు చేస్తున్నారు. వారు గతంలో మాదిరిగా క్యూలో నిలబడి పేరు, వయసు, వ్యాధి పేరు చెబితే ఆయా వివరాలతో రాసి ఇచ్చిన ఓపీ పత్రం తీసుకొని సంబంధిత వైద్యుడు ఉండే గదికి వెళ్లాలి. అలాంటి వారికి అక్కడ పాత పద్ధతిలోనే వైద్య సేవలు అందిస్తున్నారు.

డిజిటల్ సేవల కోసం 40 కంప్యూటర్ల వినియోగం



పేపర్, పెన్ వాడకానికి స్వస్తి చెప్పి డిజిటల్ సేవలను విమ్స్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగా ఏబీహెచ్‌ఏ యాప్ ద్వారా ఓపీలో రోగుల వివరాలు నమోదు చేస్తున్నాం. దీనిపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ విధానం ద్వారా వైద్యులు రోగికి సేవలు అందించడం సులువవుతుంది. రోగికి సంబంధించిన అనారోగ్య వివరాలను వైద్యుడు కూడా కంప్యూటర్‌లో నమోదు చేస్తుండడంతో రెండోసారి ఆ రోగి వచ్చినప్పుడు పూర్వాపరాలు మళ్లీ చెప్పక్కర్లేదు. తదుపరి వైద్యం అందించవచ్చు. విమ్స్‌లో డిజిటల్ వైద్య సేవల కోసం ప్రస్తుతం 40 కంప్యూటర్లు వినియోగిస్తున్నాం. – డాక్టర్ రాంబాబు, డైరెక్టర్, విమ్స్

కొత్త ఫుట్‌పాత్‌ను తవ్వేశారు!



సూర్యతేజానగర్ వరకు నిర్మించిన కొత్త రోడ్డులో ఫుట్‌పాత్‌ను తవ్వేసిన దృశ్యం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకొని చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ వరకు ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.35 కోట్లతో జీవీఎంసీ అధికారులు కొత్తగా డబుల్ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుకు ఇరువైపులా పాదచారుల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లు కూడా నిర్మించారు. ఈ రోడ్డును కొద్ది రోజుల క్రితమే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అంత వరకు బాగాగే ఉంది. ప్రారంభమైన వారం గడవక ముందే ఆ ఫుట్‌పాత్‌ను కేర్ ఆస్పత్రి నిర్వాహకులు తవ్వేశారు. కేర్ ఆస్పత్రి నిర్మాణం పూర్తయి ఇటీవల వినియోగంలో వచ్చింది. ఈ ఆస్పత్రికి బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ప్రధాన ద్వారం ఉంది. దీంతో పాటు దీన్ని ఆనుకొని కొత్తగా నిర్మించిన డబుల్ రోడ్డు వైపు అనధికారికంగా ద్వారం తెరిచారు. దీని కోసం ఆస్పత్రి నిర్వాహకులు కొత్తగా నిర్మించిన ఫుట్‌పాత్‌ను తవ్వేసి ద్వారం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ద్వారాన్ని ఆస్పత్రి నుంచి అంబులెన్స్‌లు రాకపోకల కోసం వినియోగించనున్నట్లు తెలిసింది. ఈ ఫుట్‌పాత్‌పై నడిచే వెళ్లేవారు ఇక్కడ తవ్వినచోట కిందకు దిగి రోడ్డు మీదుగా నడవాల్సిందే. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టిన కొద్ది రోజులకే ఇలా ఫుట్‌పాత్‌ను తవ్వేసి అనధికారికంగా ద్వారం ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేదంటే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా జీవీఎంసీ కమిషనర్, నగర్ మేయర్ దృష్టికి తీసుకువెళతామని హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ద్వారాక సర్కిల్ సీఐ శ్రీనివాస్

మద్దిలపాలెం : విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ద్వారకా జోన్ క్రైమ్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, సైబర్ క్రైమ్స్, పోక్సో చట్టాలపై మద్దిలపాలెంలోని వీఎస్ కృష్ణా కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెలిసీ తెలియని వయసులో నేరాలకు పాల్పడి ఎంతో మంది విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కోపం, ఉద్రేకం, ఇతర విద్యార్థులకు భిన్నంగా ఉండాలనే ఆలోచనలతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ కేసుల్లో చిక్కుకుంటున్నారని చెప్పారు. పెరుగుతున్న టెక్నాలజీని వినియోగించి సోషల్ మీడియాలో పక్కవారిపై అవమానకర పోస్టులు పెడుతూ కష్టాలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. సైబర్ క్రైమ్ చట్టాలలో భాగంగా శిక్షలకు గురవుతున్నారన్నారు. విద్యార్థినుల పట్ల వికృత చేష్టలకు దిగుతూ పోక్సో చట్టాల ప్రకారం శిక్షలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేరాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. నేరాలకు మాదకద్రవ్యాల వినియోగం కూడా ప్రధానమనే విషయాన్ని గుర్తించాలన్నారు. నేర సంస్కృతికి పూర్తిగా దూరంగా ఉంటూ సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదిగేందుకు శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామ్‌ధాస్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్ విజయబాబు, రామారారావు, తదితరులు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్య విలువలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ సమకాలిన అంశాలపై అవగాహన సాధిస్తే పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలుస్తారన్నారు. జ్ఞానం, నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. విలువలతో కూడిన విద్యలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అధ్యక్షుడు ఆచార్య ప్రసన్నకుమార్, ఉన్నత భారత్ అభియాన్ సమన్వయకర్త రామారావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి లక్ష్యంగా సీఎం జగన్ పాలన



కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం 15వ వార్డు కొండవాలు ప్రాంతమైన కొత్త వెంకోజీపాలెంలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు కావాల్సిన ఆర్థిక భరోసాను అందిస్తున్న పెద్ద మనస్సున్న నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వార్డు నాయకులు అప్పారి గిరిబాబు, వెంకటలక్ష్మి, రత్నం, అచ్యుత, సత్తిబాబు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ




సీసీ కెమెరాలు ప్రారంభం అనంతరం సూచనలు చేస్తున్న ఏసీపీ వెంకటరావు

ఎంవీపీ కాలనీ: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అవసరం ఎంతైనా ఉందని ద్వారకా క్రైమ్ ఏసీపీ వెంకటరావు అన్నారు. ద్వారకా జోన్ పరిధిలోని సీతమ్మధార, ఎంవీపీ కాలనీల్లో ఉన్న నిర్మాణ భవనాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ప్రత్యేక పాత్ర పోషిస్తాయన్నారు. వీటిని ప్రతి ఇల్లు, వాణిజ్య సముదాయం ఆవరణంలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలు జరిగేందుకు సైతం ఆస్కారం ఉండదన్నారు. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందస్తు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ దిశగా యాజమాన్యాల్లో అవగాహన పెంచాలని ద్వారకా క్రైమ్ సీఐ శ్రీనివాసరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాజు, పాల్గొన్నారు.

జాలరిపేటలో ఎంపీ ఎంవీవీ సహపంక్తి భోజనం

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సోమవారం జాలరిపేటను సందర్శించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు పలువురు గ్రామస్తులతో ముచ్చటించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. పలువురు గ్రామ పెద్దల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాలరిపేటలోని నాగరాజు, నూకమ్మల ఇంట్లో పార్టీ శ్రేణులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, స్థానిక గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలలితాపీఠం వార్షికోత్సవాలు



'మన మహర్షులు' పుస్తకం ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట : శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో 'అమృతోత్సవం' పేరిట ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న వేడుకలు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో మహా సంకల్పంతో ప్రారంభమయ్యాయి. కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ నేతృత్వంలో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, అంకురార్పణ, అగ్ని మథనం, అఖండ దీపస్థాపన, పంచగవ్య సంస్కారం నిర్వహించారు. సాయంత్రం దర్బారుహాలులో లలితా వైభవంపై కవి సమ్మేళనం నిర్వహించారు. తిరుమల పెద్దింటి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో 20 మంది కవులు పాల్గొని లలితా అమ్మవారి విశిష్టత, వైభవంపై అద్భుతమైన కవిత్వం చెప్పి అలరించా రు. ముందుగా ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు రచించిన 'మన మహర్షులు' పుస్తకాన్ని పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, ఆచార్య బాలమోహన్‌దాస్ ఆవిష్కరించారు. రాంభట్ల నృసింహశర్మ పుస్తక సమీక్ష చేస్తూ 53 మంది మహర్షుల గురించి రచయిత డి.వి.సూర్యారావు పుస్తకంలో అద్భుతమైన వివరణతో పొందుపర్చారన్నారు. అనంతరం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాఠశాల కిటికీ గ్రిల్ పడి విద్యార్థికి గాయాలు



ఎంఈవోతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు (ఇన్‌సెట్) గ్రిల్ ఊడిపోయిన కిటికీ

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో ఉన్న రవీంద్రభారతి పాఠశాల కిటికీ గ్రిల్ జారిపడి ఆదివారం ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచగా మంగళవారం వెలుగుచూసింది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన వివేక్ ఇక్కడ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అతడిని చూడడానికి వివేక్ అక్క నందిని కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వచ్చింది. ఆమె పాఠశాల నుంచి తిరిగి వెళ్తుండగా పాఠశాల నాలుగో ఫ్లోర్‌లో ఉన్న కిటికీ గ్రిల్ ఊడి నందిని తలపై పడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో సంగివలసలోని ఎన్‌ఆర్ఐ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న నందిని తండ్రి భాస్కరరావు, మరికొంత మంది పాఠశాలకు చేరుకొని సంఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. స్థానిక పోలీసులకు ఆస్పత్రి వర్గాల వారు విచారణ నిమిత్తం సమాచారం అందించారు.

ఎంఈవో విచారణ

ఆనందపురం ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి మంగళవారం పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. గ్రిల్ ఊడిపడిన కిటికీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో ఫ్లోర్‌లో నిర్వహిస్తున్న హాస్టల్ గదులు కిటికీల గ్రిల్స్ అన్నీ బలహీనంగా ఉన్నాయని వెల్లడించారు. కిటికీలకు ఉన్న అన్ని గ్రిల్స్‌ను సరిచేసేంత వరకూ ఆ ఫ్లోర్‌లో హాస్టల్ నిర్వహించరాదని ఆదేశాలిచ్చారు. సంఘటనపై శాఖాపరమైన విచారణ జరిపి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

అకారణంగా గాయాలు పాలైన విద్యార్థి కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యం ఆదుకోవాలని ఏబీవీపీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల నిర్వహిస్తున్న గదులు అస్తవ్యస్తంగా ఉన్నాయని భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటన విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం ఉందని నందిని కుటుంబ సభ్యులు మాత్రం కేసు అక్కరలేదని తెలిపి నందిని సొంత గ్రామానికి తీసుకొని వెళ్లిపోయినట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్‌కు సంబంధించిన సబ్‌స్టేషన్‌లో 33/11 కేవీ పరిధి 11 కేవీ కై లాసగిరి ఫీడర్ నిర్వహణ, హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాల తరలింపు పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. దీంతో మంగళవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కై లాసగిరి రోడ్డు, హనుమంతవాక, బీఎస్‌ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీబీ నివారణకు చర్యలు

మహారాణిపేట: వచ్చే ఏడాది నాటికి దేశంలో టీబీని పూర్తిగా నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చాంబర్‌లో సోమవారం టీబీపై సమావేశం నిర్వహించారు. జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ టీబీ నివారణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికను రూపొందించాయన్నారు. దీనిని అన్ని శాఖల అధికారులు అమలు చేయాలన్నారు. చింతల అగ్రహారం, గొరపల్లి, సరిపల్లి, ఎస్ఆర్ పురం తదితర గ్రామాల్లో టీబీ నివారణపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా టీ.బీ.నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా పంచాయతీ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యులు రామారావు, రమేష్ హాజరయ్యారు.

'కెమ్ ఈఈఈ-2024' సదస్సు ప్రారంభం



సదస్సు షెడ్యూల్ విడుదల చేస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21వరకు విశాఖలోని ఓ హోటల్‌లో సోమవారం కెమికల్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ (కెమ్ ఈఈఈ–2024) ట్రెండ్స్‌పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. శక్తి పరివర్తన ప్రాముఖ్యత, ఉద్యోగ కల్పనలో స్టార్టప్‌ల పాత్రను ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ సుద్ధసత్వబసు వివరించారు. ఎన్‌టీపీసీతో హైడ్రోజన్ ఉత్పత్తిపై పారిశ్రామిక ప్రాజెక్టులు, ఐఐపీఈ వృద్ధి, రూ.50 కోట్లకు పైగా పరిశోధన నిధులు పొందామని ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తెలిపారు. బాలికలకు ఫెలోషిప్‌లు, శాండ్‌విచ్ పీహెచ్‌డీల గూర్చి వివరించారు. కెమ్ ఈఈఈ–2024 కన్వీనర్ ప్రొఫెసర్ హేమంత్‌కుమార తన్నీరు కాన్ఫరెన్స్ థీమ్‌ను పరిచయం చేస్తూ ఈవెంట్ స్పాన్సర్స్ విద్యాన్ బయో, సెర్బ్–ఇండియా, ఇండియన్ బ్యాంక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు షెడ్యూల్‌ను సదస్సు అధ్యక్షుడు ప్రొఫెసర్ శేషగిరిరావు అంబటి వివరించారు. ఐఐపీఈ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో కొనసాగుతున్న కార్యకలాపాలను కెమ్ ఈఈఈ–2024 ప్రతినిధి ప్రొఫెసర్ వెంకటరెడ్డి పల్లేటి వివరించారు. కార్యక్రమంలో ఐఐపీఈ రిజిస్ట్రార్ రాంఫెల్ ద్వివేది, ప్రొఫెసర్ దీపాంకర్ పాల్, నిర్వాహకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు(డీఎస్‌ఆర్పీ), బి.మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సి హెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ ఎం.మధుసూదనరావు సిబ్బందితో కలసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. సుభాన్(25) అనే వ్యక్తి బ్యాగులో సుమారు 3 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ గంజాయిని విశాఖ మీదుగా కేరళకు తీసుకువెళ్తున్నట్లు విచారణలో తెలిపాడని, నిందితుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం-1లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మరణించినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆదేశాలతో ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. మృతుని వయసు సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వుంటుందని, ఎవరైనా గుర్తిస్తే విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా, లేదా 9440627547/9866413487లో తెలియజేయాలని కోరారు.